సాక్షి ఒడిశా

బుధవారం । 21 । ఆగస్టు । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 5.26.340

బంగారం: 420 మిల్లీ గ్రాములు

వెండి: 15 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



నిందితులను కఠినంగా శిక్షించాలి

పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ రాష్ట్రంలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

– 8లో

బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. నబరంగ్‌పూర్ జిల్లా పిలికా–పాకనా గూడ గ్రామాల మధ్య ఈ ప్రమాదం జరిగింది.

– 8లో

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రి జుయెల్‌కు అస్వస్థత



జుయెల్ ఓరం

భువనేశ్వర్: సుందర్‌గడ్ లోక్‌సభ సభ్యుడు, కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయెల్ ఓరాం అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం ఆయన్ను ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ నెల 11న డెంగీతో చికిత్స పొందుతూ కోలుకున్నారు. మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఎయిమ్స్ ఛాతీ విభాగంలో చేరారు. తన భార్య ఝింగియా ఓరం మరణంతో అస్వస్థతకు గురయ్యారని కుటుంబ వర్గాల సమాచారం. ఆమె డెంగీతో బాధపడుతూ మూడు రోజుల కిందటే మరణించింది.

పూరీలో దివ్యాంగుడి దారుణ హత్య



హత్యకు గురైన హరిహర సాహు

భువనేశ్వర్: పూరీ పట్టణంలో దివ్యాంగ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పాతకక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. మృతుడు స్థానిక హడొగొడియా సాహి రాధాగోవింద్ లేన్‌కు చెందిన హరిహర సాహుగా గుర్తించారు. మంగళవారం ముసుగులు ధరించిన తొమ్మిది మంది దుండగులు కత్తులు, ఇతర మారణాయుధాలతో హరిహర సాహుని వెంబడించి నరికారు. ఈ ఘటనలో తల, శరీర భాగాలకు తీవ్ర గాయాల పాలైన హరిహరను తొలుత స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కటక్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూరీ టౌన్‌స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



దెబ్బతిన్న కారు

జయపురం: బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధిలో బొరిగుమ్మ–కొట్‌పాడ్ 63వీ జాతీయ రహదారిపై బిజాపూర్ సమీపంలో మంగళవారం కారు–బైక్ పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను అంబులెన్సులో బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో శొశాహండి గ్రామానికి చెందిన కారు డ్రైవర్, సింది ముండ గ్రామానికి బైక్ చోదకుడుగా గుర్తించారు.

గంగాధర్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న తపన కుమార్ త్రిపాఠీ

జయపురం: ఒడియా సాహిత్య ప్రగతికి గంగాధర మెహత అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు సాహితీ ప్రియులు కొనియాడారు. మంగళవారం పూజ్య పూజ సంసద్ తన భవనంలో సంసద్ ఉపాధ్యక్షుడు తపన్ కిరన్ త్రిపాఠీ అధ్యక్షతన సాహితీ సభ నిర్వహించారు. గంగాధర్ మెహతా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా ఇంజినీర్ భాస్కర సామంతరాయ్ హాజరై మాట్లాడారు. ఒడియా సాహిత్య విస్తరణకు ప్రతి సాహితీవేత్త, సాహితీ ప్రియులు దోహదపడాలని విజ్ఞప్తి చేశారు. సాహిత్యం సమాజ ప్రగతికి మార్గదర్శకంగా ఉండాలని, ఆ విధంగా రచయితలు రచనలు చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి ప్రేమానంద దాస్, గౌరవ అతిథి సంస్కృతి ఉపాధ్యాయులు మనోజ్ కుమార్ మిశ్ర, డాక్టర్ కమలాకృష్ణ త్రిపాఠీ ఒడియా సాహిత్య విలువలపై ప్రసంగించారు. అనంతరం శ్వీయ సాహిత్య పఠనం, రచనలపై సమీక్ష నిర్వహించారు. రచయితలు అనంతవిజయ ధీవర్, శోభాంగిని నందొ, జానకీ పాణిగ్రహి, అనసూయ సామంతరాయ్, ఉషారాణి మహాపాత్రో, సాక్షత బెహర, అర్జున కుమార్ జయసింహ, పుష్పాంజలి శెట్టి, నారాయణ శబర, బైదేహీ సాయి, అమిత మాలిక్, స్వప్న రాణి సాహు, మమతా శెట్టి, భారతీ మాలిక్ రచనలు సమర్పించారు. పూజ్య పూజ సంసద్ కార్యదర్శి భైరవీ సాహు రచనలను సమీక్షించారు.

చంద్రపూర్‌లో ఏం జరుగుతోంది..?

- 10 రోజుల్లో ఐదుగురు మృతి
- అంతుచిక్కని వ్యాధి
- వ్యాధి లక్షణాలు గుర్తించేందుకు వైద్యారోగ్య శాఖ ప్రయత్నం



వ్యాధితో చంద్రపూర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న దృశ్యం



జుబాగుడ గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని మారుమూల ప్రాంతమైన చంద్రపూర్ సమితిలోని హనుమంతపూర్ పంచాయతీ జుబగుడలో అంతుచిక్కని వ్యాధి భయపెడుతోంది. ఈ వ్యాధి బారిన పడి గత పది రోజుల్లో నలుగురు మృతి చెందగా శనివారం నాడు మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. వ్యాధితో మృతి చెందిన వారిలో రాజేంద్ర నాయక్ (22), అమెస్ జగరంగ (4), బుటుడి దివాక (62), ధరణీ దివాక (45) ఉన్నారు. తాజాగా ఈ వ్యాధితో శనివారం నాడు నీలు దివాక (14) లు మృతి చెందాడు. ముందుగా వ్యాధికి గురైన వారిలో జ్వరం, వాంతులు రావడంతో ఒండి నిండా పొక్కులు కనిపిస్తున్నాయి. కొద్ది రోజుల్లోనే బాధితులు చనిపోతున్నారు. సమాచారం తెలుసుకున్న వైద్య బృందం జుబాగుడ చేరుకుని వ్యాధికి గురైన వారి మల,మూత్రాలు,రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ దిశగా ప్రయత్నిస్తుంది. అయితే ఇప్పటికే మరో 15 మంది ఈ వ్యాధి బారిన పడినట్లు సమాచారం. గ్రామానికి చెందిన సామంత దివాక (12), నిమంతి దివాక (18), సంతోష్ దివాక (17), సుసాల్ జగరంగ (25), లుద్రు దివాక (65), జొర్గా దండింగ్ దివాక (45) లు వ్యాధితో చంద్రపూర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

వ్యాధి నిర్ధారణ కాలేదు

చంద్రపూర్ సమితి జుబాగుడ గ్రామంలో వ్యాధులతో మృతి చెందుతున్నారని సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధి లక్షణాలు తెలుసుకునేందుకు వివిధ పరీక్షలను నిర్వహిస్తున్నామని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రైత్రాయ్ తెలిపారు. వ్యాధి ప్రస్తుతం అదుపు దిశగా ఉందని అనారోగ్యానికి గురైన గ్రామస్తులు సకాలంలో చికిత్స చేయించుకునేందుకు ముందుకు రావాలని అన్నారు. అయితే కొంతమంది మూఢనమ్మకాలతో సొంత వైద్యం చేయించుకుని ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారని ఆయన చెప్పారు.

‘సిమ్ బాక్స్’కు జార్ఖండ్ లింక్!



పోలీసులు స్వాధీనపరచుకున్న సిమ్ బాక్సులు(ఫైల్)

- రాంచీకి బయల్దేరిన రాష్ట్ర పోలీసులు
- రిమాండ్‌లో నిందితుడు రాజు మండల్

భువనేశ్వర్: సిమ్ బాక్స్ క్రైమ్ నెట్‌వర్క్ ఛేదించేందుకు జంట నగరాల కమిషనరేట్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రిమాండ్‌లో ఉన్న రాజు మండల్ సమాచారం ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తొలుత భువనేశ్వర్ తర్వాత కటక్ నగరాల్లో సిమ్ బాక్స్ క్రైమ్ నెట్‌వర్క్ జాడల్ని ధ్రువీకరించారు. తదుపరి విచారణ కోసం దర్యాప్తు బృందం జార్ఖండ్ రాష్ట్రం రాంచీ ప్రాంతానికి బయలుదేరింది.

రాజధాని కేంద్రంగా..

నగరానికి వచ్చిన ఆసబ్బూర్ స్థానిక లింగరాజ్ హోటల్‌లో బస చేశాడు. ఈ విషయాన్ని రిమాండ్‌లో ఉన్న రాజు మండల్ పోలీసులకు చెప్పడంతో సంబంధిత హోటల్లో తనిఖీలు చేపట్టారు. అక్కడ కొంత సమాచారం లభించినట్లు జంట నగరాల పోలీసు కమిషనర్ సంజీబ్ పండా తెలిపారు.

రాంచీ కేంద్రంగా దర్యాప్తు..

మూడు రోజులుగా ఈ కేసు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ మీదుగా ఒడిశా, జార్ఖండ్ వరకు ఈ నెట్‌వర్క్ విస్తరించినట్లు ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో వెల్లడైంది. జార్ఖండ్‌లో స్థావరాల వివరాల కోసం రాంచీ కేంద్రంగా దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో బంగ్లాదేశీయుడు అషద్దూర్ జమాన్ ప్రధాన సూత్రధారిగా తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్‌లోని రాజు మండల్‌ను హస్తగతం చేసుకుని, సిమ్‌బాక్స్ నేర సామ్రాజ్యం విస్తరణ జరిపిస్తున్నట్లు సమాచారం. భువనేశ్వర్, కటక్ నుంచి మొత్తం 12 సిమ్ బాక్సులను స్వాధీనం చేసుకున్న తర్వాత జార్ఖండ్ నుంచి మరింత సమాచారం బయటపడుతుందని భావిస్తున్నారు.

సిమ్ బాక్స్ అంటే..

సిమ్ బాక్స్ ఒక పరికరం. ప్రపంచంలో ఎక్కడైనా దాని నుంచి కాల్స్, సమూహ సందేశాలు పంపించవచ్చు. ఫోను చేసే వ్యక్తి వివరాలు బయటపడనీయకుండా ఇది ఉపయోగపడుతుంది. కాల్ ఎక్కడి నుంచి వస్తుందో తెలియకపోతే అది విదేశీ కాల్‌గా గుర్తించి వ్యూహాత్మకంగా నేర కార్యకలాపాలు సాగించే వీలుంటుంది.

లక్ష్మీ బస్సులు రావడం లేదు



కలెక్టరేట్ రోడ్డులో హాల్టు చేసిన లక్ష్మీ బస్సు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీకి కనెక్టివిటీగా వేసిన లక్ష్మి బస్సులు గత మూడు రోజులుగా కొత్త బస్టాండ్‌కు రావడం లేదు. పర్లాకిమిడి ఊరి శివార్లలో ఉన్న అగ్నిమాపక దళం కూడలి వద్ద నిలిపివేస్తున్నారు. దీంతో ఏడో మైలు, ఉప్పలాడ, కంట్రగడ, నారాయణపూర్, రాయగడ, గండాహాతికి వెళ్లే గ్రామీణ ప్రయాణికులు ఆటోలు, నడకదారిన ఊరి శివార్లకు వెళ్లాల్సి వస్తోంది. దీనిపై ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ప్రసన్న కుమార్ దాస్ తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



నబరంగ్‌పూర్ డీసీసీ కార్యాలయంలో రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి


కొరాపుట్: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి ఘనంగా జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పించారు. కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి ప్రసంగించారు. అప్పట్లో రాజీవ్ ఆలోచనలు, విధానాలు నేడు నిజమవుతున్నాయని అన్నారు. రాజీవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొరాపుట్ జిల్లా పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కా దేశ రాజధానిలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాజీవ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.



పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో నివాళులు అర్పిస్తున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా

27న పోలవరం వద్దకు బీజేడీ బృందం

కొరాపుట్: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాన్ని బీజేడీ బృందం ఈ నెల 27వ తేదీన సందర్శించనుంది. ఇప్పటికే ఒడిశా విపక్ష బీజూ జనతా దళ్ పార్టీ బృందం మల్కన్‌గిరి జిల్లాలో పోలవరం ముంపు గ్రామాలను సందర్శించింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్ట్ నిర్మాణ ప్రదేశానికి వెళ్లాలని నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకులతో పాటు అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన నాయకులు వెళ్లనున్నారు. పోలవరం ఎత్తు పెంచడం వల్ల ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో అనేక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ముంపు గ్రామ ప్రజల పరిహారాల విషయం తేలకుండానే ప్రాజెక్ట్ నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం ప్రకటించింది. దీంతో బీజేడీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆదేశాలతో ఇప్పటికే పార్టీ బృందం మల్కన్‌గిరి జిల్లాలో పర్యటించి నవీన్‌కు నివేదిక అందజేసింది. నివేదికను పరిశీలించిన నవీన్ ప్రధాన ప్రాజెక్టు వద్దకు వెళ్లాలని ఆదేశించారు.



ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్న దృశ్యం


76 కేజీల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి చిమ్టాపల్లి పంచాయతీ దాబగూడ గ్రామానికి చెందిన మంగరాజ్ లక్ర 76 కేజీల గంజాయితో మంగళవారం బలిమెల పోలీసులకు పట్టుబడ్డాడు. నాలుగు బస్తాల్లో దాచి ఉన్న ఈ గంజాయి విలువ రూ.4లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

రవులిలో అతిసారం

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి శంకరడ పంచాయతీలోని రవులి గ్రామంలో అతిసార వ్యాధి వ్యాపించింది. వ్యాధి బారిన పడి ఒకరు మృతి చెందగా.. మరో పది మంది మంచాన పడ్డారు. గ్రామానికి చెందిన మింజాయి మాఝి(61) అనే వృద్ధుడు విరేచనాలు, వాంతులతో శనివారం మృతి చెందాడు. శివాని మాఝి(4), జునాయి మాఝి(35), ఘన మాఝి (8) టికిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతుండగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మరో ఏడుగురు చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఆరోగ్య శాఖ అప్రమత్తమై రవులి గ్రామానికి వైద్య బృందాన్ని తరలించింది. వ్యాధితో ఉన్న వారి మల, మత్రాలు, రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రాత్రయ్ తెలియజేశారు. కొద్ది నెలల క్రితం ఈ సమితి పరిధిలో గల డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరొ గ్రామంలో అతిసార వ్యాధితో ఐదుగురు చిన్నారులు చనిపోయిన సంగతి తెలిసిందే. మొదట్లో అతిసారంగా భావించిన వైద్య బృందం అనంతరం పరీక్షలను నిర్వహిస్తే డిఫ్తీరియాగా తేలింది.

నదిలో ఆర్తనాదం.. పల్లెలో బీభత్సం



మహా నది మధ్యలో చిక్కుకున్న ఏనుగుల గుంపు



పంట పొలాల్లో ఏనుగుల స్వైర విహారం

భువనేశ్వర్: మహానది మధ్యలో ఏనుగుల గుంపు చిక్కుకుంది. కటక్ జిల్లా అఠొగొడా సమీపం ఉత్తర బంకి సువర్ణపూర్ గ్రామానికి తీరాన ఈ ఘటన చోటుచేసుకుంది. నది మధ్యలో మూడు ఏనుగులు చిక్కుకున్నట్లు గ్రామస్తులు సమాచారం అందించడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అటవీ శాఖ నిఘా ఏర్పాటు చేసింది. చందకా అటవీ ప్రాంతం నుంచి అఠొగొడా ప్రాంతానికి వెళ్లేందుకు నదిని దాటుతుండగా ఇవి చిక్కుకున్నట్లు సమాచారం.

సుందరగఢ్ జిల్లాలో..

సుందరగడ్ జిల్లా బొడొగాంవ్ గ్రామ పరిసరాల్లో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. పొలాల్లో చొరబడి పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. నాలుగు ఇళ్లను ధ్వంసం చేశాయి. స్థానిక మహాబీర్ కొండల ప్రాంతంలోనూ ఏనుగుల గుంపు పొంచి ఉన్నట్లు గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాక్సైట్ అక్రమ డంపింగ్ యార్డ్‌పై తిరుగుబాటు



యార్డు నిర్మాణ సిబ్బందికి లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత హెచ్చరికలు

కొరాపుట్: భారీ వాహనాలు మైనింగ్ చేసే ప్రాంతంలోకి హీరో వెళ్లగానే వాహనాలన్నీ వెనక్కి వెళ్లిపోయే సీన్లు సినిమాల్లో కనిపిస్తుంటాయి. కొరాపుట్ జిల్లాలో నిజంగానే ఇలాంటి సంఘటన జరిగింది. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి సింగారం గ్రామం వద్ద మంగళవారం రైల్వే లైన్ పక్కన డంపింగ్ యార్డ్ నిర్మాణం జరుగుతోంది. అక్కడకు కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంతా వచ్చారు. ఇది తెలిసి వందలాది మంది గిరిజనులు అక్కడికి చేరుకుని డంపింగ్ యార్డ్ ఎత్తేయాలని నినాదాలు చేశారు. యార్డ్ సిబ్బందికి ఇక్కడ నిర్మాణం కోసం అనుమతి పత్రాలు చూపించాలని అడిగారు. వారు తమ వద్ద లేవని బదులిచ్చారు. అప్పటికే పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో యార్డ్ సిబ్బంది తమ చైర్మన్‌తో మాట్లాడమని ఎమ్మెల్యేకు ఫోన్ ఇచ్చారు. ఫోన్‌లో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. తక్షణం ఇక్కడి నుంచి సామగ్రి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అప్పటికే పోలీసులు, తహసీల్దార్లు అక్కడకు చేరుకున్నారు. అక్రమ నిర్మాణం జరుగుతుంటే అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. గిరిజనుల ఆందోళనలు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది నిర్మాణం ఆపి సామగ్రిని లారీలలో ఎక్కించి, వెనక్కి మరలడం ప్రారంభించారు. దీంతో యార్డు మూతపడింది. ఒక్కసారిగా గిరిజనులు హర్షధ్వానాల మధ్య ఆ ప్రాంతం దద్దరిల్లింది.

బాక్సైట్ ఖనిజాన్ని వేదాంత కంపెనీ నిల్వ ఉంచడానికి మైత్రి సంస్థ ఈ నిర్మాణం చేస్తోంది. గతంలో బాక్సైట్‌ని కక్కిరిగుమ్మకి పంపి రైల్వేలో ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం సింగారం నుంచి ఎగుమతి చేయడానికి ఇక్కడ నూతనంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఇక్కడ నిర్మాణానికి గ్రామ సభ,పల్లె సభ అనుమతులు లేవు. అంతేకాక రైల్వే ప్రదేశంతో పాటు, గ్రామానికి చెందిన కొందరి వ్యక్తుల స్థలాలు కూడా డంపింగ్ యార్డులో కలిసిపోయాయి. సుమారు 40 ఎకరాల్లో ఉన్న ఈ డంపింగ్ యార్డ్ కోసం తన వద్ద వివరాలు లేవని తహసీల్దార్ పేర్కొన్నారు. గిరిజనులు ఈ యార్డు ఎత్తేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. చివరకు లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత చొరవతో యార్డు వెనక్కి మళ్లింది.



తాము ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తున్న స్థానికులు



ఎమ్మెల్యేను చుట్టుముట్టి తమ గోడు వినిపిస్తున్న గిరిజనులు



యార్డు వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు



వాహనాలు వెనక్కి మళ్లించమని హుకుం జారీ చేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

క్లుప్తంగా

ఫారెస్టర్ బైకు దగ్ధం



కాలిపోతున్న బైక్

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి శంకరాడ ఫారెస్టర్ గౌతమ్ కుమార్ పండకు చెందిన బైకును గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం బాధితుడు టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాయగడ అటవీ డివిజన్ పరిధిలో గల టికిరి పంచాయతీలోని శంకరడ గ్రామంలో ఫారెస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమ్ తనకు కేటాయించిన ప్రభుత్వ క్వార్టర్ ముందు బైకును ఉంచాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బైకుపై పెట్రోల్ పోసి తగులబెట్టారు. గౌతమ్‌కు మెలకువ వచ్చి బయటకు వచ్చి చూసేసరికి బైక్ కాలిపోతోంది. దీంతో ఆయన సోమవారం పోలీసులకు విషయం చెప్పాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బైకు వద్ద గల పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకుని దుండగుల గురించి గాలిస్తున్నారు.

నీరు గారిన అభిశంసన తీర్మానం



సస్మిత సాహు, నిమ్మాపడా ఎన్ఏసీ చైర్మన్

భువనేశ్వర్: పూరీ జిల్లా నిమ్మాపడా నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్ఏసీ) చైర్‌పర్సన్ సస్మితా సాహుపై అభిశంసన తీర్మానం నీరుగారింది. అభిశంసనకు అనుకూలంగా 8 ఓట్లు అవసరం. నిబంధనల ప్రకారం నిర్వహించిన పోలింగులో 8 ఓట్లు పడ్డాయి. వీటిలో ఒక ఓటు రద్దయ్యింది. దీంతో అభిశంసనకు అనుకూలంగా 7 ఓట్లు పడినా ఫలితం లేకపోయింది. అవిశ్వాస తీర్మానం తిరస్కరణకు గురైంది. నిమ్మాపడా ఎన్ఏసీలో మొత్తం కౌన్సిలర్ల సంఖ్య 11 కాగా, నిబంధనల ప్రకారం చైర్మన్‌ను తొలగించాలంటే 8 ఓట్లు అవసరం. బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ మరియు స్వతంత్ర వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున 3 మంది కౌన్సిలర్లు పోలింగులో పాల్గొనలేదు. అభిశంసన ప్రతిపాదన నీరుగారడంతో బీజేడీ శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. ఎన్ఏసీ కార్యాలయం నుంచి వందలాది మంది బీజేడీ కార్యకర్తలు పార్టీ జెండా పట్టుకుని నినాదాలు చేస్తూ చైర్‌పర్సన్‌ను ఊరేగించారు. ఈ సందర్భంగా నిమ్మాపడా పట్టణంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తానని అధ్యక్షురాలు సస్మితా సాహు తెలిపారు.

నేటి బంద్‌కు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలు సిద్ధం



కొరాపుట్ కలక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రుపక్ తురుక్, జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలక

కొరాపుట్: బుధవారం జరిగే భారత బంద్‌కు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలు సిద్ధమయ్యాయి. ఎస్సీ, ఎస్టీ మహా సంఘం సభ్యులు జిల్లా కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు బంద్ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రుపక్ తురుక్ ప్రకటించారు. బీజేడీకి చెందిన కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను ఎవరూ విభజించలేరని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఇప్పటికే బంద్ సందర్భంగా సెలవు ప్రకటించాయి.

విజిలెన్స్ వలలో రెవెన్యూ అధికారులు

భువనేశ్వర్: ఇద్దరు రెవెన్యూ అధికారులు లంచం తీసుకుంటూ విజిలెన్స్ వలకు చిక్కుకున్నారు. వీరిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తులసి ప్రధాన్, అమీన్ ముకేష్ సాహు ఉన్నారు. సంబల్‌పూర్ జిల్లా బమరా మండలం కెషెయిబహాల్ గ్రామంలో ఒక స్థలం విషయంలో విచారణ ముగించేందుకు లంచం డిమాండ్ చేశారు. ఒప్పందం ప్రకారం రూ. 10,000 లంచం సొమ్ములో చివరి వాయిదా రూ. 7,000 లంచం తీసుకుంటుండగా మంగళ వారం విజిలెన్సు చేతికి చిక్కారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి



మృతి చెందిన శివ బోత్ర

కొరాపుట్: బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మంగళ వారం నబరంగ్‌పూర్ జిల్లా పిలికా-పొకనాగూడ గ్రామాల మధ్య ప్రమాదం జరిగింది. ముగ్గురు మిత్రులు కలసి ఒక బైక్ మీద వేగంగా వస్తూ అదుపు తప్పడంతో బైక్ బోల్తా పడింది. ఘటనలో పిలికా గ్రామానికి చెందిన జలంధర్ బోత్ర (24), పపడాహండి సమితి ఖోర్గి గ్రామానికి చెందిన శివ బోత్ర (25) అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే వాహనం మీద ఉన్న నరహరి బోత్ర స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



పర్లాకిమిడి :ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఐఎంఏ ఆధ్వర్యంలో ఆందోళన

పర్లాకిమిడి: పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ పర్లా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గజపతి ప్యాలస్ నుంచి హైస్కూల్ జంక్షన్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్తూ నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, స్థానిక ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రి ఎదుట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు.

జయపురం: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఒడిశా మహా దళిత పరిషత్ కొరాపుట్ జిల్లా శాఖ కార్యకర్తలు ప్రధాన రోడ్డులో కొవ్వొత్తుల రాలీ నిర్వహించారు. పారాబెడ కూడలి వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్దకు చేరుకుని కొవ్వొత్తులు వెలిగించారు. మహిళలకు రక్షణ కరువైందని, తక్షణమే నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.



జయపురం: శ్రద్ధాంజలి ఘటిస్తున్న మహాదళిత పరిషత్ మహిళా నాయకురాలు మనోలిష టక్రి



పర్లాకిమిడి : గజపతి ప్యాలెస్ వద్ద పర్లా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

విచారణ..



ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరమర్శిస్తున్న కొరాపుట్ జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలకా



హాస్టల్‌లో విచారణ చేస్తున్న లక్ష్మీపూర్ బీడీఓ గురేశ్వర బొయి

కొరాపుట్: హాస్టల్‌లో విద్యార్థి కత్తి పోటుకు గురైన ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సోమవారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి పంచడ గ్రామంలోని ప్రభుత్వ వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థి కొప్పరసేన డంబిక అనే విద్యార్థిపై సహచర విద్యార్థి లింగు మండగి కత్తితో పొడిచిన విషయం పాఠకులకు విదితమే. బాధితుడు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విషమ స్థితిలో ఉన్నాడు. మంగళవారం కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా ఆస్పత్రిని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణమే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత కూడా బాధితుడి పరామర్శించారు. ఈ ఘటనపై మండిపడ్డారు. హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొరాపుట్ జిల్లాలో అన్ని సంక్షేమ శాఖ హాస్టళ్లలో తనిఖీలు చేయాలన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యపై అసెంబ్లీ వేదికగా పోరాటం చేస్తానన్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాలతో లక్ష్మీపూర్ బీడీఓ గురేశ్వర బోయి హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులను విచారించారు. ఉపాధ్యాయుల తీరుపై సమీక్ష నిర్వహించారు.

'గ్రీవెన్స్ సెల్'కు వినతుల వెల్లువ



తొలిసారిగా విచ్చేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్ కోసం ఎదురుచూస్తున్న ఉదయపూర్ ప్రజలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా నువాగడ బ్లాక్ ఉదయపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ పరిపాలన, గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యనిర్వహణ అధికారి పృథ్వీరాజ్ మండల్ హాజరయ్యారు. కిరమా, అనుగుర్, పరిమళ, ఉదయపూర్ పంచాయతీల నుంచి ప్రజలు తరలివచ్చారు. 86 వినతులు అందగా.. వీటిలో ఐదు వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. 33 వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. గ్రామ సమస్యలు 53 ఉన్నాయి. ఐదుగురు నిస్సహాయులకు రూ.22 వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కలెక్టర్ అందజేశారు. ఆరుగురు గిరిజనులకు జంగిల్, భూ పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఉదయపూర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ మెడికల్ అధికారులు, ఐసీడీఎస్, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు.



ప్రజల వినతులు వింటున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

'మలి విడత' మొదలు



సభలో సంతాప తీర్మానం ప్రతిపాదించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



స్పీకర్ పోడియం చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో మంగళవారం మలి విడత సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన దివంగత సభ్యులకు శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాప తీర్మానం ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు విపక్ష బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ మద్దతు ప్రకటించారు. అనంతరం సభలో కాసేపు సభ్యులు అంతా మౌనం వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జషీపూర్ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే సుందర మోహన్ మాఝి మృతిపై సంతాపం ప్రకటించారు.

సభలో గందరగోళం

సంతాప కార్యక్రమం ముగియడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణ పురస్కరించుకుని విపక్ష కాంగ్రెసు సభలో దుమారం రేపింది. దీంతో సభా కార్యక్రమాల్ని తొలుత ఉదయం 11.41 గంటల వరకు వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రకటించారు. తిరిగి సమావేశాలు ప్రారంభించేందుకు చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. సభలో యథాతథంగా కాంగ్రెసు సభ్యుల వ్యతిరేకత సద్దుమణగకుండా వాడీవేడిగా ఊపందుకుంది. కాంగ్రెసు సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టారు. ఈ పరిస్థితుల్లో సభా కార్యక్రమాలు ముందుకు సాగకపోవడంతో మరోసారి సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు.

తూర్పు కోస్తా రైల్వే ప్రధాన మైలురాయి ఆవిష్కరణ



ఖుర్దా రోడ్-బొలంగీర్ 7వ నంబరు సొరంగం

భువనేశ్వర్: ఖుర్దా రోడ్ – బొలంగీర్ రైల్ లైన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తూర్పు కోస్తా రైల్వే సరికొత్త మైలు రాయిని ఆవిష్కరించింది. పురుణాకటక్, చారిఛొకా మధ్య 1,975 మీటర్ల పొడవైన సొరంగం నిర్మాణం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ మార్గంలో ఇది 7వ నంబరు సొరంగంగా జోనల్ అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో రైలు రవాణా అనుసంధానం మెరుగుదల, విస్తరణ కోసం జరుగుతున్న ప్రయత్నాలలో ఇది కీలకమైన ముందడుగు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

– ప్రియురాలు మృతి



ప్రాణాపాయ స్థితిలో ప్రియుడు

భువనేశ్వర్: పెద్దలు పెళ్లికి నిరాకరించడంతో ఓ ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రియురాలు ప్రాణాలు కోల్పోయింది. కలహండి జిల్లా కెసింగా ప్రాంతంలో మంగళ వారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. తేల్ నదిపై నిర్మించిన రైల్వే వంతెనపై ప్రేమికులు రైలు ముందుకు దూకారు. ఘటనలో యువతి మృతి చెందగా, యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో బొలంగీర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. సంఘటన స్థలానికి స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

పూరీ సాగర తీరంలో మానవ అస్థిపంజరం లభ్యం

భువనేశ్వర్: పూరీ సాగర తీరంలో మానవ అస్థిపంజరం, పుర్రె లభించాయి. సోమవారం అర్ధరాత్రి పూరీ బీచ్ సమీపంలోని స్టెర్లింగ్ హోటల్ రోడ్డు పక్కన ఓ వ్యక్తి పుర్రె, శరీర భాగాలు పడి ఉన్నాయి. అక్కడ దొరికిన చొక్కా ఆధారంగా అది మగ అస్థిపంజరం అయి ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందడంతో పూరీ బలియాపండా ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి పుర్రె, శరీర భాగాలను స్వాధీనం చేసుకున్నారు. పరీక్షల నిమిత్తం వీటిని శ్రీజగన్నాథ్ వైద్య కళాశాలకు తరలించారు.

రత్న భాండాగారంలో ఖాళీ బీరువాల తరలింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారం నుంచి అన్ని విలువైన వస్తువులను బదిలీ చేసిన తర్వాత ఖాళీ బీరువాలు, చెక్క పెట్టెలను ఈ నెల 23న వేరే చోటకు తరలించనున్నారు. ఖాళీ కంటైనర్లను రత్న భాండాగారం లోపలి, బయటి గదుల నుంచి బయటకు తీసి మందిరం ఆవరణలో ఉన్న నీలాద్రి విహార్ మ్యూజియంలో భద్రపరుస్తారు. ఈ ప్రక్రియ మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమవుతుంది. సమగ్రంగా ఈ కార్యాచరణ పూర్తయ్యేంత వరకు భక్తులకు సర్వ దర్శనం నిలిపి వేస్తున్నట్లు శ్రీ జగన్నాథ ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన నిర్ధారిత కార్యాచరణ మార్గదర్శకాల (ఎస్ఓపీ)కి అనుగుణంగా కంటైనర్‌లను తరలిస్తారు. దర్శనం కోసం సందర్శకులను మందిరం లోపలికి అనుమతించరు. మహాప్రసాదం పొందాలనుకునే భక్తులు సింహద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించవచ్చు. ఆనంద్ బజార్ నుంచి మహా ప్రసాదం పొందిన తర్వాత వారు ఉత్తర ద్వారం నుంచి బయటకు రావాలని తెలిపారు.

అంతా నిరుపేదలు.. అయినా రూ.కోట్లలో లావాదేవీలు

కొరాపుట్: వారంతా నిరుపేదలు. బీపీఎల్ కార్డుదారులు. కానీ వారి బ్యాంక్ అకౌంట్లు పరిశీలిస్తే కోట్లాది రూపాయల లావాదేవీలు కనిపించాయి. నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రంలో ఉండే ఉత్కర్ష మైక్రో ప్రైవేట్ బ్యాంక్‌లో ఖాతాలు ఉండే జొరిగాం వాసులు మంగళవారం ఈ విషయాన్ని గమనించారు. సుమారు 13 మంది ఖాతాల్లో రు.14 కోట్ల పైగా లావాదేవీలు జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. నిజానికి వీరంతా ఈ బ్యాంక్‌లో ఖాతాలు ఏప్రిల్ నెలలో తెరిచారు. వారికి వచ్చిన ఓటీపీ నంబర్లు బ్యాంక్ సిబ్బంది తీసుకున్నారు. అంతే కాక వారి బ్యాంక్ పాస్‌బుక్‌లు నేటికీ ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిసాన్ యోజన పథకంలో తమ పేర్లు నమోదు చేసుకోవడానికి ఆయా కేంద్రాలకు వెళ్లినప్పుడు ఈ విషయం వెలుగులోనికి వచ్చింది. దీంతో అంతా కలిసి బ్యాంకుకు వెళ్లి ప్రశ్నించగా.. వారు తమ వద్ద వివరాలు లేవని పేర్కొన్నారు. ఈ విషయం పై జొరిగాం మాజీ సమితి చైర్మన్ ప్రసన్న మజ్జి జొరిగాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



కోట్లాది రూపాయలు లావాదేవీలు జరిపిన ఆధారాలు చూపిస్తున్న బాధితులు

హామీలు ఏమయ్యాయి?



కొట్‌పాడ్ సంతలో కరపత్రాలు పంచుతున్న బీజేడీ నేతలు

● బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేడీ నేతలు

జయపురం: రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడితే పెన్షన్‌దారులందరికీ నెలకు రూ.3,000 నుంచి రూ.3,500 వరకు పెంచుతామని బీజేపీ నేతలు చేసిన వాగ్దానం ఏమైందని బీజేడీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ వారపు సంత, దైనిక బజారులో తిరుగుతూ బీజేపీ పాలకుల అబద్ధపు వాగ్దాలను తెలియజేసే కరపత్రాలను అందజేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు, వితంతువులు, తదితర పెన్షన్‌దారులకు రూ.3000, 80 శాతం దివ్యాంగులకు రూ.3500 మాత్రం పెన్షన్ పెంచారని, మిగతా పెన్షన్‌దారులకు యథాతథంగా ఉంచారని బీజేడీ నేతలు ఆరోపించారు. రాష్ట్రంలోని 57 లక్షల లబ్ధిదారులుంటే 52 లక్షల మందిని బీజేపీ పాలకులు మోసం చేశారన్నారు. కేవలం పెన్షన్‌దారులనే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోవటంపై బీజేడీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ మఝి, కొట్‌పాడ్ మాజీ ఎమ్మెల్యే చంద్ర శేఖర మఝి, మాజీ మంత్రి పద్మిణీ దియాన్, కొట్‌పాడ్ బీజేడీ నేత పంకజ కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థికసాయం



ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఆర్థిక సహాకారం అందజేస్తున్న కలక్టర్

రాయగడ: వ్యవసాయ రంగంలో మహిళలు ముందంజ వేయాలని, అందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలక్టర్ ఫరూల్ పట్వారీ అన్నారు. జిల్లాలోని బిసంకటక్ సమితి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయం రంగంపై ఆసక్తి కనబరుస్తున్న మహిళలను ప్రోత్సాహించాలని సూచించారు. జీవికా మిషన్ ద్వారా మూడు ఎస్‌హెచ్‌జీ మహిళా బృందాలకు వరి, కూరగాయలు పండించేందుకు, కిరాణా దుకాణం ఏర్పాటు కోసం మరో మహిళా బందానికి రూ.లక్ష చొప్పున్న మూడు ఎస్‌హెచ్‌జీ బృందాలకు ఆర్థిక సహకారాన్ని అందించారు. సమితిలో గల వివిధ సమస్యలను ఆ ప్రాంత ప్రజలు కలక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రహదారులు, తాగునీరు, ఆవాస్ గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల నుంచి మొత్తం 59 వినతులను స్వీకరించిన కలక్టర్ వాటిని సత్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గుణుపూర్ సబ్ కలక్టర్ కిరణ్ దీప్ కౌర్, ఎస్పీ హరీష్, జిల్లా ముఖ్యవైద్యాధికారి లాల్ మోహన్ రౌత్రయ్, జిల్లా అటవీశాఖ అధికారి సచిన్ అన్నా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత్ బంద్



రాయగడ: మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు



జయపురం: సబ్‌కలక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ హరిజన నేతలు

రాయగడ: దేశవ్యాప్తంగా బుధవారం చేపట్టనున్న బంద్‌కు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని జిల్లా ఆదివాసీ, హరిజన దళిత వర్గాలకు చెందిన నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక హోటల్ తేజస్విలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయా సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు దేశ ఉన్నత న్యాయస్థానం ఆమోదముద్ర వేయడాన్ని వ్యతిరేకిస్తూ చేపడుతున్న ఈ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రాలకు దీనిపై రాజ్యాంగబద్ధ అధికారం ఇవ్వాడానికి వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో రాయగడ జిల్లా ఆదివాసీ సమాజ్ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, సభ్యులు జలంధర్ పుషిక, ఆదివాసీ నాయకుడు హరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌కు అనుమతి ఇవ్వాలి..

జయపురం: దేశ వ్యాప్తంగా బుధవారం చేపట్టనున్న బంద్‌కు కొరాపుట్ జిల్లా ఆదివాసీ హరిజన మిళిత కార్యాచరణ కమిటీ విస్తృత సన్నాహాలు చేసింది. మంగళవారం జయపురం సబ్‌కలక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, జయపురం సదర్ పోలీస్ స్టేషన్ అధికారి ఈశ్వర తండిని వేర్వేరుగా కలిసి బంద్‌కు అనుమతి ఇవ్వాలని వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో ఆదివాసీ కమ్యూనిటీ కార్యదర్శి భద్ర నాయక్, పొరజ సమాజ్ అధ్యక్షుడు బాసు నాయక్, కొరాపుట్ జిల్లా మహా దళిత పరిషత్ మహిళా నాయకురాలు మనోలిశ టక్రి, గదబ సమాజ్ కార్యదర్శి జితేంద్ర నాయక్ తదితరులున్నారు.

గంజాం జిల్లాలో కల్తీ సారా కలకలం

● 15 మందికి అస్వస్థత
● ఒకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న కల్తీ సారా బాధితులు

భువనేశ్వర్: గంజాం జిల్లాలో కల్తీ సారా కలకలం రేపింది. కల్తీ సారా తాగి 15 మంది అస్వస్థతకు గురి అయ్యారు. చికిటి ప్రాంతంలో 20 మంది కల్తీ సారా తాగారు. వీరిలో అస్వస్థతకు గురైనవారిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. ఒకరు మినహా మిగిలిన వారందరి పరిస్థితి నిలకడగా ఉందని, తీవ్ర అస్వస్థతకు గురైన వ్యక్తి ఆరోగ్యం కూడా క్రమంగా కోలుకుంటుందని రాష్ట్ర అబ్కారి శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. ఈ కేసులో ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. పోలీసు, అబ్కారి శాఖ వర్గాలు మౌండ్‌పూర్, జైనాపూర్, కరబులా ప్రాంతాల్లో సోదాలు చేపట్టాయన్నారు. రాష్ట్రంలో దొంగ సారా అమ్మకం కట్టడికి కొత్త అబ్కారి విధానంలో స్పష్టమైన మార్గదర్శకాల్ని జోడించడం జరుగుతుందని మంత్రి వివరించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..

రాష్ట్రంలో మద్య నిషేధాన్ని నిర్ధారించడంలో భారతీయ జనతా పార్టీకి చిత్తశుద్ధి లేదని ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ మంగళవారం ఆరోపించింది. ఎన్నికలకు ముందు రాష్ట్రాన్ని మద్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇచ్చి గద్దెనెక్కిందని, అధికారంలోకి రావడంతో ఈ విషయాన్ని విస్మరించిందని బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ శాసన సభ ప్రాంగణంలో మీడియాకు తెలిపారు.

రాష్ట్రంలో కల్తీ సారా ఏరులై పారే పరిస్థితులు తలెత్తుతున్నాయని, గంజాం జిల్లా చికిటి మండలం కె.నువాగాంవ్ ప్రాంతంలో ఈ విచారకర సంఘటన చోటు చేసుకుందన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయడానికి, అరికట్టడానికి బీజేపీ ప్రభుత్వం ఇంకా ఎటువంటి ప్రణాళికను రూపొందించ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిషేధం వైపు ఎలాంటి ప్రయత్నం చేయకుండా, మద్యం దుకాణాలు, వ్యాపారులను ప్రోత్సహిస్తోందని ఎద్దేవా చేశారు. చికిటిలో చోటు చేసుకున్న తాజా సంఘటన దీనికి నిలువెత్తు తార్కాణమన్నారు. కరుబులా గ్రామానికి చెందిన 20 మంది మౌండ్‌పూర్ ప్రాంతంలో కల్తీ సారా తాగారన్నారు. వీరిలో 17 మంది కాసేపటికే అస్వస్థతకు గురయ్యారని, తక్షణ చికిత్స కోసం చికిటి ఆరోగ్య కేంద్రంలో చేర్చారన్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమించడంతో బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించినట్లు బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ తెలిపారు.

బీజేపీ అభ్యర్థిగా మమతా మహంతా



రాజ్యసభ బీజేపీ టికెటు అందుకుంటున్న మమతా మహంత

భువనేశ్వర్: ఊహించినట్లుగానే రాజ్య సభ ఉప ఎన్నికకు బీజేపీ మమతా మహంతను అభ్యర్థిగా ప్రతిపాదించింది. బీజేడీతో పాటు రాజ్య సభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఇటీవల బీజేపీలో చేరిన మమతా మహంతను బీజేపీ నామినేట్ చేసింది. త్వరలో జరగనున్న ఉప ఎన్నిక కోసం పలువురు ఆశావాహులు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. ఎగువ సభకు కుడుమి కులానికి చెందిన గిరిజన నాయకురాలు మమతా మహంతకు బీజేపీ టికెటు కేటాయించింది. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సెప్టెంబర్ 3న రాజ్య సభ ఉప ఎన్నిక జరగనుంది. మమతా మహంత 2020 ఏప్రిల్‌లో బిజూ జనతా దళ్ అభ్యర్థిగా రాజ్య సభకు ఎన్నికయ్యారు. ఆమె 6 సంవత్సరాల రాజ్య సభ పదవీకాలం ముగియడానికి 18 నెలలు మాత్రమే మిగిలి ఉండగా సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఉప ఎన్నిక అనివార్యం అయింది.

గెలుపు గుర్రం..

బీజేపీ అభ్యర్థి మమతా మహంతా గెలిపొందడం తథ్యమని భావిస్తున్నారు. 147 మంది సభ్యుల్లో 78 మంది సభ్యులు ఉన్నందున రాష్ట్రంలో రాజ్య సభ ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధించడం దాదాపు ఖాయమని విశ్లేషకుల అంచనా.

క్లుప్తంగా

'ఇన్‌స్పైర్' ప్రాజెక్టులు నమోదు చేయండి

● డీఈఓ ఎన్.ప్రేమకుమార్



మాట్లాడుతున్న డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: ఇన్‌స్పైర్ మానక్ పోటీల కోసం ప్రాజెక్టులు నమోదు చేయాలని డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక పీఎస్‌ఆర్ స్కూల్‌లో జరిగిన సైన్స్ టీచర్ల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులను ఈ నెల చివరి లోగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో గల ఉన్నత పాఠశాలల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు చొప్పున నమోదు చేయాలని తెలియజేశారు. ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులను అప్‌లోడ్ చేయడంపై వివరించారు. జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు అధ్యక్షతన ఒక రోజు ఓరియంటేషన్ సదస్సు జరగ్గా రిసోర్స్ పర్సన్‌లుగా ఎస్.ఉమామహేశ్వరరావు, టి.రాజేష్, 300 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోంగార్డులుగా కారుణ్య నియామకపత్రాలు



నియామకపత్రాలను అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హోంగార్డు విభాగంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఇద్దరు హోంగార్డ్స్ కుటుంబాలకు కారుణ్య నియామకాల్లో భాగంగా వారి సతీమణులను హోంగార్డులుగా నియమిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన హోంగార్డ్స్ కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా వారి కుటుంబంలోని ఇద్దరు మహిళలను పోలీస్‌శాఖలో హోంగార్డులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశామన్నారు. ఇటీవల కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిన హోంగార్డ్ జి.వెంకట సత్యం సతీమణి జి.పార్వతికి, అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు ఎస్.చిన్నోడు సతీమణి ఎం.రజనిలను హోంగార్డులుగా నియమించి, నియామక ఉత్తర్వులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్ కుమార్, డీపీఓ పర్యవేక్షకులు ప్రభాకరరావు, ఆర్ఎస్సై షేక్ అలీ, ఇతర పోలీసు అధికారులు, హోంగార్డ్స్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం

● డీఎంహెచ్‌ఓ కె.విజయ పార్వతి



సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ కె.విజయ పార్వతి

పార్వతీపురం టౌన్: దోమల వ్యాప్తిని అరికట్టడానికి పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ పార్వతి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సర్ రోనాల్డ్ రాస్ చిత్ర పటానికి డీఎంహెచ్‌ఓ, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు సోకడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, డ్రైడే పాటించాలని తద్వారా ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, నోడల్ అధికారి ఎం.వినోద్, వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు, మలేరియా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శంకరరావు(ఫైల్)

పాచిపెంట: గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పాచిపెంట మండలంలోని పాంచాలి గ్రామంలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. ,గ్రామానికి చెందిన మహిచర్ల శంకరరావు(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న ఆటో రిపేర్‌కు డబ్బులివ్వాలని అడిగిన క్రమంలో తల్లిదండ్రులతో చిన్నపాటి వివాదం నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన శంకరరావు గడ్డిమందు తాగేశాడు. వెంటనే తల్లిదండ్రులు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పీవీటీజీల అభివృద్ధే ధ్యేయం

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పీవీటీజీ)ల సమీకృత అభివృద్ధే ధ్యేయం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. పీఎం జన్‌మాన్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అభివృద్ధి సూచికలు గణనీయంగా మార్పు చెందాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, గృహాల కల్పన శతశాతం లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ జీవన ప్రమాణాలలో మంచి మార్పులు రావాలని చెప్పారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కుటుంబం యూనిట్‌గా ప్రణాళికలు ఉండాలని పేర్కొన్నారు. జన్‌మాన్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ఉపయోగించుకోవాలని సూచించారు. రహదారులు అనుసంధానం కాని గిరిజన ఆవాసాలకు రహదారుల నిర్మాణానికి సమగ్ర అంచనాలతో ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. ప్రతి గ్రామానికి సంబంధించి పూర్తి వివరాలు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అవసరం ఉన్న వసతిగృహాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వారం రోజుల్లో సమర్పించాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్మిస్తున్న ఏడు బహుళార్థక వినియోగ సామాజిక భవనాలు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని చెప్పారు. మొబైల్ టవర్లను నెల రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజి మాట్లాడుతూ వందకు పైగా జనాభా కలిగిన 43 ఆవాసాలకు 38.65 కిలోమీటర్ల మేర 19 అనుసంధాన రహదారులు మంజూరు చేసినట్లు తెలిపారు. పరిపాలన అనుమతులు మంజూరు కావలసి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్ఎస్ శోభిక, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి వి.వెంకట రమణ, ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో తనిఖీలు నిర్వహించాలి

జిల్లాలోని అన్ని వసతిగృహాలు, చిన్నారుల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలని, వసతులు, వాటికి అనుమతులు ఉన్నది, లేనిది పరిశీలించాలని, అనుమతులు లేని వాటిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహాలు తనిఖీ చేసి అనుమతులు పరిశీలించి, తనిఖీలపై మండలాల వారీగా నివేదిక అందజేయాలని కోరారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా వసతిగృహాలు, సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లయితే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందులో ఉన్న పిల్లలను ప్రభుత్వ వసతిగృహాలకు తరలించాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా వసతిగృహాలు, సంరక్షణ కేంద్రాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. మండల అభివృద్ధి అధికారులు, బీసీ, సోషల్ వెల్ఫేర్ అధికారులు వెంటనే అన్ని హాస్టల్స్‌ను తనిఖీలు చేసి రిపోర్టు అందజేయాలని ఆదేశించారు. వార్డెన్లు వసతిగృహంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, వసతిగృహాల్లో నాణ్యతతో కూడిన, తాజా ఆహారాన్ని అందించాలని, అనుమతి లేకుండా బయటివారు అందించే ఆహారపదార్థాలు స్వీకరించకూడదని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి గయాజుద్దీన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్



వరి సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

సాలూరు రూరల్: ప్రతి రైతు కనీసం ఒక ఎకరా భూమిలో సేంద్రియ వ్యవసాయం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు మండలంలో క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా బంగారమ్మ కాలనీలో కొట్యాడ శ్రీనివాసరావు వేసిన ఆర్‌జీఎల్ 7034 మినీ కిట్ వరి ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించారు. ఈ వెరైటీ సాంబమసూరి కన్నా 10 రోజులు ముందుగా కోతకు వస్తుందని చెప్పారు. అనంతరం మండలంలోని అన్నంరాజువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల ఏటీఎం మోడల్‌ఫీల్డ్‌ను చూశారు. మామిడిపల్లి రైతు సేవా కేంద్రంలో మూడు మండలాల ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ ప్రతి రైతు కనీసం ఒక్క ఎకరాలో సేంద్రియ వ్యవసాయం చేయాలని, సేంద్రియ వ్యవసాయంతో రైతుకు పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. అనంతరం సాలూరులో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లో విత్తన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సాలూరు సబ్‌డివిజనల్ అధికారి మధుసూదన్ రావు, మండల వ్యవసాయ అధికారి అనూరాధ పండా, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రమీల పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్ట్

● 22.7 కిలోల సరుకు సీజ్
● వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి వాసన రాకుండా అగరబత్తీలు, కంఫర్ట్ లిక్విడ్‌ను వినియోగించి రవాణా చేసేందుకు ప్రయత్నించిన దుండగుల ప్రయత్నం బెడిసికొట్టింది. విజయనగరం రూరల్ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 22.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ జిల్లాకు చెందిన మహమ్మద్ వసీం (ఎ1) తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఉండేవాడు. అక్కడి నుంచి ఏడాదిన్నర క్రితం విజయనగరానికి వలస వచ్చి ధర్మపురి పంచాయతీ పరిధిలోని వసంతవిహార్ లేఅవుట్‌లో ఒక విల్లాను అద్దెకు తీసుకుని ఉంటూ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో చేసి, వేర్వేరు ప్రాంతాలకు రవాణా చేస్తున్నాడు. ఈ మేరకు కచ్చితమైన సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఇన్‌చార్జ్ సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రైడ్ చేసి ఇంట్లో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో వసీంతో పాటు బీహార్ రాష్ట్రంలోని కిషాన్ గంజ్ జిల్లా అల్తవాడ గ్రామానికి చెందిన ఇన్సాఫ్ అలం (ఎ2), ఢిల్లీలోని జామియానగర్‌కు చెందిన రుక్సాయి కుర్షిద్ (ఎ3) అనే మహిళ ఉన్నారు. నిందితుల్లో ఇన్సాఫ్ ఆలం, రుక్సాయి కుర్షిద్‌లు గంజాయిని ఢిల్లీ తీసుకు వెళ్లేందుకు విజయనగరం వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో గంజాయితో పాటు ప్యాకింగ్ చేసేందుకు వినియోగించే కంఫర్ట్ లిక్విడ్, అగరబత్తీలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు, ఇతర రాష్ట్రాల వారికి ఇళ్లను అద్దెకు ఇచ్చేముందు వారి పూర్వాపరాలు తెలుసుకోవాలని, వారు ఇంటిని ఎందుకు వినియోగిస్తున్నదీ పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే అద్దెకు ఇవ్వాలని ఎస్పీ వకుల్ జిందాల్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, ఎస్బీ సీఐ కేకేవీ.విజయనాథ్, రూరల్ ఎస్సైలు ఆర్.వాసుదేవ్, శ్యామల, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

31న గర్భాశయ కేన్సర్ నివారణకు వ్యాక్సినేషన్

● రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాద్‌రావు

విజయనగరం ఫోర్ట్: ఈనెల 31న స్థానిక పేర్లవారి వీధిలో ఉన్న సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ చెవిటి, మూగ పాఠశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, గరాశయ కేన్సర్‌ను నివారించేందుకు వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు 9 నుంచి 14 ఏళ్ల మధ్య ఉన్న బాలికలకు గర్భాశయ కేన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ కూడా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అమెరికాలోని బోస్టన్ నగరానికి చెందిన మానవ సేవ స్వచ్ఛంద సంస్థ సహకారం అందిస్తోందని వివరించారు.

మళ్లీ చదువుకుందాం..!

● దూర విద్యావిధానంలో అడ్మిషన్లు ప్రారంభం
● టెన్త్, ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం
● సెలవు రోజుల్లోనే తరగతులు



గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దూర విద్య విధానంలో టెన్త్ చదువుతున్న వారు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: చదువుకోవాలనే తపన ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల చదువుకు దూరమైన వారు మళ్లీ చదువుకునేందుకు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యావిధానం) మళ్లీ చదువుకుందాం ..రా..అంటూ ఆహ్వానిస్తోంది. అందుకోసం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవాలనే వారు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకుని విద్యావంతులయ్యేందుకు అవకాశం ఏర్పడింది.

పదో తరగతిలో ప్రవేశాలకు అర్హతలు

● 14 సంవత్సరాలు నిండి చదవగలిగి, రాయగలిగిన పరిజ్ఞానం కలవారందరూ అర్హులే.
● పదవ తరగతి ఫెయిల్ అయిన వారు, బడి మధ్యలో మానివేసి 14 సంవత్సరాలు నిండిన వారికి పదవ తరగతి చదువుకునేందుకు సువర్ణ అవకాశం.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హతలు

15 సంవత్సరాలు నిండి పదవ తరగతి పూర్తయిన వారందరూ ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశం.
☛ ఇంటర్మీడియట్ మానివేసిన వారికి, ఫెయిల్ అయిన వారికి మళ్లీ చదువుకునే అవకాశం.

లభించే వెసులుబాటు

✔ సరళమైన సార్వత్రిక విద్యా విధానం
✔ మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఒక సదవకాశం.
సెలవు రోజుల్లో మాత్రమే తరగతులు నిర్వహిస్తారు.

ఇష్టమైన ఏవైనా 5 సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేయవచ్చు.

✍ ఉచిత పాఠ్యపుస్తకాలు లేక సులభమైన స్వీయ అభ్యసన సామగ్రి ఇంటికే పంపిస్తారు.
✍ జ్ఞానధార యూ ట్యూబ్ చానల్, apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కంటెంట్‌ను పొందవచ్చు.
✍ పాఠశాలలో పదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఫెయిల్ అయినప్పటికీ పాసైన రెండు సబ్జెక్టుల మార్కులు బదలాయించుకునే అవకాశం.
✍ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, మాజీ సైనికోద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ.
✍ అభ్యాసకులు ప్రవేశం పొందిన నాటి నుంచి 5 సంవత్సరాల వరకు 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలకు హాజరుకావచ్చు.

ప్రవేశ విధానం

ఇంటర్నెట్ సెంటర్లు, ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు లేదా గ్రామ, వార్డు సచివాయాల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రవేశం పొందవచ్చు.

పది కేంద్రాలు

సార్వత్రిక విద్యా పీఠం ద్వారా విద్యాబోధన కార్యక్రమాలను పార్వతీపురం మన్యం జిల్లాలోని 10 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. అవి పార్వతీపురం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం, మక్కువ, పాచిపెంట, బలిజిపేట, వీరఘట్టం, పాలకొండ మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సార్వత్రిక విద్యా పీఠం సెంటర్లు ఉన్నాయి.

ప్రవేశాలకు గడువు

సార్వత్రిక విద్యా పీఠంలో ప్రవేశాలు జూలై 31 నుంచి ప్రారంభమవ్వగా ఈనెల 27వ తేదీ ఆన్‌లైన్ ఆప్లికేషన్ ఫారం సమర్పించేందుకు చివరి రోజు. కాగా నిర్ణీత అడ్మిషన్ ఫీజు మరియు రూ.200 అపరాధ రుసుముతో చెల్లించేందుకు ఈనెల 28వ తేదీ చివరి రోజు. అంతే కాకుండా ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారం సమర్పించేందుకు నిర్ణీత అడ్మిషన్ ఫీజు, అపరాధ రుసుముతో చెల్లించేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 4 వరకు అవకాశం కల్పించారు.

సార్వత్రిక విద్యాపీఠం సేవలను వినియోగించుకోవాలి



సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునేందుకు చక్కని అవకాశం లభించింది. చదువు పట్ల ఆసక్తి ఉన్నవారు, పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న చిరుద్యోగులు, గృహిణులు, వ్యాపారాల్లో రాణిస్తున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-ఎం.సుధాకర్, సార్వత్రిక విద్యాపీఠం జిల్లా కో ఆర్డినేటర్, పార్వతీపురం మన్యం జిల్లా

హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో ఈ నెల 18న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేశామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పట్టణ పరిధి మల్లికార్జున కాలనీకి చెందిన పడాల శేఖర్‌పై గొల్లవీధికి చెందిన నాగళ్ల గణేష్ దాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టుచేసి శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ చెప్పారు.

హజ్ యాత్రకు దరఖాస్తులు

విజయనగరం టౌన్: పవిత్ర హజ్ యాత్రకోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా–2025కు ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబరు 9లోపు దరఖాస్తు చేసుకోవాలని హజ్ కమిటీ నిర్ణయించినట్లు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.జాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్ణీత గడువు ప్రకారం హజ్ యాత్ర కోసం దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి యాత్రికుడు తన మెషిన్ రీడబుల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాస్‌పోర్ట్ వ్యాలిడిటీ, హజ్ దరఖాస్తు ముగింపు తేదీకి ముందే జారీచేసి ఉండాలన్నారు. 2026 జనవరి 15వరకూ చెల్లుబాటయ్యేలా చూసుకోవాలని సూచించారు. హజ్‌యాత్రకు ఎంపికైన యాత్రికులు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ప్రత్యేక హజ్ సువిధ యాప్‌ను ప్రారంభించిందని, అన్ని సౌకర్యాలను సులభతరం చేసేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. 'హజ్‌కమిటీ డాట్ జీఓవీ డాట్ ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 0866-2471786 నంబర్‌ను కానీ టోల్ ఫ్రీ నంబర్ 1800-4257873ను సంప్రదించాలని తెలిపారు.

అది కొంటేనే ఇది..!

● డీఏపీకి గుళికలతో లింక్ పెడుతున్న డీలర్లు
● గత్యంతరం లేక కొనుగోలు చేస్తున్న రైతులు
● విషయం తెలిసినా పట్టించుకోని అధికారులు



విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పాలేపు సూకరాజుది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. రెండు ఎకరాల పొలం కౌలుకు చేస్తున్నాడు. అందులో వరి పంట సాగు చేశాడు. వరి పంటకు డీఏపీ వేసేందుకు గంట్యాడ మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ప్రైవేట్ దుకాణానికి వెళ్లి రెండు బస్తాల డీఏపీ కావాలని డీలర్‌ను అడగ్గా బస్తా డీఏపీ కావాలంటే రూ.500 విలువ చేసే గుళికలు తీసుకోవాలని చెప్పాడు. గుళికలు అవసరం లేదన్నా డీలర్ వినిపించుకోలేదు. గుళికలు తీసుకుంటేనే డీఏపీ ఇస్తానని తెగేసి చెప్పాడు. దీంతో చేసేది లేక 2 బస్తాల డీఏపీకి అదనంగా రెండు గుళికలు డబ్బాలు రూ.1000 చెల్లించి తీసుకున్నాడు. అలాగే ఇదే మండలానికి చెందిన రైతు పి.సత్యారావు కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ఎరువుల దుకాణానికి వెళ్లి బస్తా డీఏపీ కావాలని అడిగాడు. గుళికలు తీసుకుంటేనే డీఏపీ ఇస్తానని ఈ రైతుకు కూడా డీలర్ తెగేసి చెప్పాడు. దీంతో చేసేది లేక గుళికలకు రూ.500 చెల్లించి డీఏపీ కూడా తీసుకున్నాడు.

వీరిద్దరే కాదు. అనేక మంది రైతులది ఇదే పరిస్థితి. రైతుల అవసరాన్ని ప్రైవేట్ డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. డీఏపీ కొరతను అసరాగా చేసుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

డీఏపీ కొరత ఆసరాగా..

జిల్లాలో ఎరువుల దుకాణాలు 200 వరకు ఉన్నాయి. జిల్లాలో డీఏపీ కొరత ఉండడంతో డీలర్లు దాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. ఏవిధంగానైనా రైతులు డీఏపీ కొనుగోలు చేస్తారని డీఏపీకి గుళికలతో లింకు పెడుతున్నారు. డీఏపీ బస్తా రూ 1350 అయితే, దానికి అదనంగా గుళికలు రూ.500 వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఎన్ని బస్తాలు తీసుకుంటే అన్ని గుళికలు తీసుకోవాల్సిందే. దీని వల్ల రైతులకు అదనంగా భారం పడుతోంది. అసలే సాగు గిట్టుబాటు కాక రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో డీఏపీకి గుళికలకు లింక్ పెట్టడంతో మరింత అవస్థలు పడుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

డీఏపీకి గుళికలతో లింకు పెడుతున్న విషయం వ్యవసాయ అధికారులకు తెలిసినప్పటికీ చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది రైతులు డీలర్లు డీఏపీకి గుళికలతో లింకు పెట్టిన విషయం అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.



డీఏపీ బస్తాలు



రైతులకు అంటగడుతున్న జింక్ బకెట్‌లు

4699 మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి డీఏపీ 11,164 మెట్రిక్ టన్నులు కేటాయించారు. జిల్లాకు 6934 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఇందులో రైతు భరోసా కేంద్రా(రైతు సేవాకేంద్రాలు)లకు 5465 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు 1469 మెట్రిక్ టన్నులు వచ్చింది. ఇందులో 4699 మెట్రిక్ టన్నుల డీఏపీ రైతులకు విక్రయించారు. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల వద్ద 930 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 1281 మెట్రిక్ టన్నుల డీఏపీ ఉంది.

గతంలో ఆర్‌బీకేల వద్దే ఎరువుల విక్రయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో రైతులకు ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లోనే అందించేవారు. . రైతు భరోసా కేంద్రాలకే అధిక శాతం ఎరువులను కేటాయించేవారు. దీంతో రైతులు అక్కడే ఎరువులు కొనుగోలు చేసేవారు. ప్రైవేట్ డీలర్లు రైతులను ఇబ్బంది పెట్టినట్లయితే వారిపై అధికారులు చర్యలు తీసుకునేవారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

రైతులను ఇబ్బంది పెట్టినట్లయితే చర్యలు తప్పవు. డీఏపీకి గుళికలతో లింకు పెడితే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటాం. ఎవరైనా డీలర్ డీఏపీకి గుళికలతో లింక్ పెట్టినట్లయితే సంబంధిత మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలి

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

● ఉపాధ్యాయులకు డీఈఓ సూచన

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులంతా అంకితభావంతో కృషి చేయాలని డీఈఓ జి.పగడాలమ్మ స్పష్టం చేశారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ పగడాలమ్మ ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విద్యాబోధన తీరును పరిశీలించి, నూతనంగా నిర్మించిన అదనపు భవనాలు, మరమ్మతులు చేసిన తరగతి గదులను తనిఖీ చేశారు. తరువాత పాఠశాలలో మౌలికవసతులు, మధ్యాహ్నభోజన వంటలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో విద్యాబోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాపరంగా సబ్జెక్టుల వారీగా వెనుబడి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తతతీసుకుని వారిని ముందు వరుసలోకి తేవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డు బాగుచేయాలని డిమాండ్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, కార్యకర్తలు

రోడ్ల అధ్వానంపై ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నేతలు, కార్యకర్తలు వినూత్నంగా నిరసన తెలిపారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని పూల్‌బాగ్ రోడ్డులోని ఓ పెద్దగుంతలో నిలిచిన బురదనీటిలో కూర్చొని మరీ మంగళవారం ఆందోళనకు దిగారు. అధికారంలోకి రాగానే రోడ్లు వేస్తామని చెప్పిన కూటమి నేతలు ఎక్కడని నిలదీశారు. చాలాసేపు వారు అలాగే రోడ్డుపై ఉండిపోవడంతో అదే దారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాయకులు వచ్చి హామీ ఇచ్చినంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. మున్సిపల్ మేనేజర్ జి.ఎం.శివప్రసాద్, ఏఈ రవి తదితరులు అక్కడికి చేరుకుని, వారం రోజుల్లోగా రోడ్డు మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి కదిలారు. -బొబ్బిలి